సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం । 5 । జూలై । 2024



పాములకాలం.. భద్రం

వానలకు పుట్టల్లో నీళ్లు నిలిచి విషసర్పాలు బయట సంచరిస్తాయి. ఆహారం కోసం జనావాసాల్లోకి వస్తాయి. అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో▸



రోశయ్య సేవలు మరువలేనివి

మాజీ సీఎం రోశయ్య సేవలు మరువలేనివని నాయకులు కొనియాడారు. జిల్లా కేంద్రంలో ఆయన జయంతిని ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /26.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్ల బడుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

రుణమో రామచంద్రా..!

ఇతని పేరు రొక్క పద్మారావు. భీంపూర్ మండలం అంతర్గాంకు చెందిన రైతు. ఈ వానాకాలంలో గ్రామ శివారులోని తన ఐదెకరాల్లో



పత్తి, అంతరపంటగా కంది సాగు చేస్తున్నాడు. గతేడాది తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అర్లి (టీ) బ్రాంచ్ నుంచి రూ.2లక్షల వ్యవసాయ రుణం తీసుకున్నాడు. దానికి ఈ ఏడాది వరకు రూ.17,500 వడ్డీ అయింది. పాత రుణం చెల్లిస్తేనే కొత్త రుణం ఇచ్చే పరిస్థితి ఉంది. దీంతో వడ్డీ భారం నుంచి తప్పించుకునేందుకు రైతుకు రెన్యూవల్ చేసుకునే పరిస్థితి తప్పలేదు. మరో వైపు కొత్త అప్పు ఇచ్చామని చెప్పుకోవడానికి బ్యాంక్‌కు లెక్కలోకి వస్తుంది. మొత్తంగా ఆ రైతు చేత వడ్డీ కట్టించుకుని పాత రుణాన్ని మళ్లీ కొత్తగా ఇచ్చినట్లు బ్యాంక్ అధికారులు రికార్డుల్లో నమోదు చేసుకున్నారు.

ఈ రైతు పేరు నారడి మల్లేశ్. బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందినవాడు. గ్రామంలో 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వానాకాలంలో ఆరెకరాల్లో



పత్తి, ఆరెకరాల్లో మక్క సాగు చేస్తున్నాడు. పెట్టుబడి భారంగా మారింది. గతేడాది తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రూ.1.50 లక్షల పంట రుణం తీసుకున్నాడు. గత డిసెంబర్‌లో రూ.2లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదు. ఈ పరిస్థితుల్లో పెట్టుబడి కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద రూ.2లక్షలు అప్పు తీసుకుని సాగు చేస్తున్నాడు.



- పెట్టుబడి కోసం అన్నదాతల పాట్లు
- కొత్త లోన్ ఇవ్వమంటున్న బ్యాంకర్లు
- పాత రుణాలు చెల్లించాలని ఒత్తిడి
- రెన్యూవల్ కోసమని వడ్డీ వసూలు
- రుణ పరిమితి పెరిగినా ఫలితమేది?
- మళ్లీ వడ్డీ వ్యాపారుల వద్దకే రైతులు

సాక్షి, ఆదిలాబాద్: వానాకాలం సాగు ప్రారంభించిన రైతన్నకు పెట్టుబడి భారంగా మారింది. బ్యాంకుల్లో పంట రుణం తీసుకుందామంటే పాత రుణం కట్టాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో సహజంగానే బ్యాంక్‌కు వెళ్లగానే బుక్ అడ్జస్ట్‌మెంట్ పద్ధతి కొనసాగుతోంది. వడ్డీ కట్టించుకుని పాత రుణాన్నే కొత్త రుణంగా మారుస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో రైతు చేతికి రుణం వచ్చిందీలేదు. కాగా, పెంచిన పంట రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ప్రకారమైనా కొంత మొత్తం రైతుకు ఇస్తే ఇలాగైనా పెట్టుబడి భారం కొద్దిగా తగ్గేది. అయితే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కూడా రుణాలు లభించడం లేదనేది రైతుల ఆవేదన. ఈ పరిస్థితుల్లో రైతులకు ప్రైవేట్ అప్పులే దిక్కవుతున్నాయి.

పంట రుణ పరిమితి పెంపు ఇలా..

పంటరకం	2023-24	2024-25
పత్తి	రూ.42వేలు	రూ.46వేలు
సోయా	రూ.26వేలు	రూ.30వేలు
కంది	రూ.21వేలు	రూ.21వేలు
మినుము	రూ.18వేలు	రూ.21వేలు
పెసర	రూ.18వేలు	రూ.22వేలు
జొన్న	రూ.17వేలు	రూ.21వేలు

పూర్తిస్థాయి రెన్యూవల్ ఏది?

జిల్లాలో రైతులకు సంబంధించి వివిధ బ్యాంకుల్లో 1,50,265 ఖాతాలున్నాయి. గతేడాది 1,13,754 మంది రైతులే తమ రుణాలను రెన్యూవల్ చేసుకున్నారు. ఈ ఏడాది 1,22,808 మంది రైతుల ఖాతాలను రెన్యూవల్ చేయాలని బ్యాంక్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

గతేడాది కంటే లక్ష్యం పెంపు

2023–24లో పంట రుణ లక్ష్యం రూ.2,354 కోట్లు కాగా, బ్యాంకర్లు రైతులకు రూ.1,696 కోట్లు మాత్రమే ఇచ్చి 72 శాతం లక్ష్యం సాధించారు. 2024–25 పంట రుణ లక్ష్యం రూ.2,577 కోట్లు కాగా, గతేడాది కంటే 9.50 శాతం అదనంగా పెంచారు. ఈ ఏడాది బ్యాంకర్లు ఏ మేరకు రుణ లక్ష్యం సాధిస్తారో.. వేచి చూడాల్సిందే.

అనాదిగా ఇదే తంతు..

ప్రైవేట్ అప్పులు రైతుల నడ్డి విరగ్గొడుతున్నాయి. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో 'దిడి' పేరిట వడ్డీ వ్యాపారం ఈ పంట కాలంలో అనాదిగా కొనసాగుతూ వస్తోంది. కొంతమంది వడ్డీ వ్యాపారులు ఏజెన్సీ రైతుల కష్టాన్ని కొల్లగొడుతున్నారు. ఉదాహరణకు.. రూ.లక్ష అప్పు తీసుకుంటే ఆరు నెలల తర్వాత ఆ వ్యాపారికి రైతు వడ్డీ కలిపి రూ.లక్షన్నర చెల్లించాలి. అలాగే జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో 'సవాయి' 'సాకారి' లాంటి వడ్డీ వ్యాపారం కూడా రైతుల జీవితాలను చెల్లాచెదురు చేస్తోంది. రూ.లక్ష అప్పు తీసుకుంటే పంట కాలం తర్వాత 25శాతం వడ్డీ కలిపి అసలు చెల్లించాలి. ఇలా బ్యాంకుల్లో పూర్తిస్థాయిలో పంట రుణం లభించకపోవడంతో రైతులు ప్రైవేట్ అప్పులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దళారులు, వడ్డీ వ్యాపారులంతా కలిసి రైతును అడ్డగోలుగా లూటీ చేస్తున్నారు. బ్యాంకులు పూర్తి స్థాయిలో రుణం అందించనందునే రైతులకు ఈ పరిస్థితి తలెత్తుతోంది. బ్యాంకర్లు తమ లక్ష్యానికి దూరంగా నిలుస్తున్నారు. గతేడాది జిల్లాలో పంట రుణం లక్ష్యంపై 72 శాతమే మంజూరు చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది.

రెన్యూవల్ చేసుకోవాలి

రైతులు తమ పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి. బ్యాంకుల ద్వారా ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించాం. లక్ష్యం మేరకు రుణం అందించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. గతేడాది కంటే ఈసారి ఎక్కువ ఖాతాలకు వ్యవసాయ రుణం అందించేలా లక్ష్యం పెట్టుకున్నాం.

– కే భాస్కర్‌ప్రసాద్, ఎల్డీఎం, ఆదిలాబాద్

న్యూస్‌రీల్

'జోగు' జన్మదిన వేడుకలు



వృద్ధులతో కలిసి కేక్ కట్ చేస్తున్న రామన్న

ఆదిలాబాద్‌టౌన్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న జన్మదిన వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేఆర్‌కే లోని వృద్ధాశ్రమంలో వృద్ధులు, రిమ్స్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వీధి వ్యాపారులు, విద్యార్థులకు గొడుగులు అందజేశారు. బీఆర్‌ఎస్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, నాయకులు సాజిదొద్దీన్, తుల శ్రీనివాస్, రమేశ్, రాజేశ్వర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జిల్లా పరిషత్ ఆత్మీయ సమావేశం

కైలాస్‌నగర్: జిల్లా పరిషత్ ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో రత్నమాల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో జెడ్పీ చైర్మన్, వివిధ మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలను ఘనంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

టీచర్లను కేటాయించాలి

తాంసి: విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించాలని భీంపూర్ మండలం అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాల వద్ద గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. పాఠశాలలో 81మంది విద్యార్థులుండగా ఒక ఉపాధ్యాయుడే బోధిస్తున్నారని తెలిపారు. ఎస్జీటీ బదిలీల్లో భాగంగా అతను కూడా వేరే పాఠశాలకు బదిలీ కాగా, ఇక్కడికి మరో ఉపాధ్యాయుడు రాకపోవడంతో రిలీవ్ కాకుండా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్, డీఈవో స్పందించి విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు రాకేశ్ యాదవ్, స్వామి, నరేశ్‌యాదవ్, గంగారెడ్డి, కపిల్, రాజు తదితరులున్నారు.

నూతన నియామకం



ప్రమాణ స్వీకారం చేస్తున్న బాల్‌చంద్ర టాక్రే

ఆదిలాబాద్‌టౌన్: పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడిగా బాల్‌చంద్ర టాక్రే నియమితులయ్యారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న సత్యనారాయణగౌడ్ రిటైర్డ్ కావడంతో ఆయన స్థానంలో అసోసియేట్ అధ్యక్షుడిగా ఉన్న బాల్‌చందర్‌ను నియమించారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో అధ్యక్షుడిగా టాక్రే ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి, ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుడాల రవీందర్, సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ సక్సెస్

ఆదిలాబాద్‌టౌన్: నీట్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని గురువారం విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించగా, ప్రభుత్వ విద్యాసంస్థలను విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ రాహుల్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ ప్రదీప్‌కుమార్‌జోషి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు శంతన్‌రావు, సాయికుమార్, నవీన్‌కుమార్, అశోక్, సుజయ్, హరీశ్, కేశవ్, వినోద్‌కుమార్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కైలాస్‌నగర్: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు శుక్రవారం రిమ్స్ సబ్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేక పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు టౌన్–3 ఏఈ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని ఆదిలాబాద్ నార్త్, సౌత్, టౌన్–3, మావల, ఆదిలాబాద్ రూరల్ ప్రాంతాల్లోని వినియోగదారులు దీర్ఘ కాలిక సమస్యలను సీజీఆర్‌ఎఫ్ కోర్టు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

స్మృతి వనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి



స్తూపం వద్ద అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

ఇంద్రవెల్లి: అమరవీరుల స్తూపం వద్ద చేపట్టిన స్మృతి వనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని అమరవీరుల స్తూపాన్ని సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న స్మృతి వనం స్థలాన్ని పరిశీలించారు. నిర్లక్ష్యం చేయకుండా పనులు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. అనంతరం నాగోబా ఆలయాన్ని సందర్శించారు. దర్బార్ హాల్‌లో మెస్రం వంశీయులతో సమావేశమయ్యారు. గతంలో మంజూరైన నిధులు, ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.కోటి నిధులతో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ధర్మశాలతో పాటు భక్తుల విశ్రాంతి కోసం ప్రత్యేక గదులు నిర్మించాలని మెస్రం వంశీయులు కోరారు. ఐటీడీఏ ఈఈ భీంరావ్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశీయులు తుకారాం, మెస్రం బాదిరావ్, మెస్రం శేఖర్‌బాబు, ఆనంద్‌రావ్, అధికారులు తదితరులున్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజలింగు కరుమ కులస్తులు, బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో సహాయ బీసీ సంక్షేమాధికారి సునీత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అభివృద్ధే లక్ష్యం



స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అధికారులు

- కలెక్టర్ రాజర్షి షా
- నార్నూర్‌లో నీతి ఆయోగ్ సంపూర్ణత అభియాన్ ప్రారంభం

నార్నూర్: సంపూర్ణ అభివృద్ధే నీతి ఆయోగ్ సంపూర్ణ అభియాన్ లక్ష్యమని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గురువారం నార్నూర్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నీతి ఆయోగ్ సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, నీతి ఆయోగ్ ప్రతినిధి బిప్లబ్‌తో కలిసి ప్రారంభించారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయం నుంచి సీహెచ్‌సీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రిలోని సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అస్పిరేషనల్ బ్లాక్‌గా నార్నూర్‌ను గుర్తించినందుకు ఆరు పారామీటర్స్‌పై ఫోకస్ చేసి మూడు నెలలు సంబంధిత అధికారులు ఇక్కడే ఉండి వీక్లీ టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు. నీతి ఆయోగ్ సంపూర్ణ త అభియాన్ కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో మూడు నెలల్లో లక్ష్యాన్ని చేరే దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని సమస్యలు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా స్థాయి అధికారులు వారానికోసారి సమీక్షా సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఐసీడీఎస్ పీడీ మిల్కా, డీఆర్డీవో సాయన్న, అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్, మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, డీపీఆర్వో తిరుమల, ఎంపీడీవో జవహర్, తహసీల్దార్ రాజలింగు, ప్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ అడే సురేశ్, మాజీ ఎంపీపీ కనక మోతుబాయి, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాళ్లు

నీతి ఆయోగ్ సంపూర్ణత అభియాన్ ప్రారంభం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సరస్వతి మండల సమాఖ్య, వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమశాఖ, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పరిశీలించారు.

ఇక అర్హులకే రేషన్



- అనర్హుల ఆహారభద్రత కార్డుల ఏరివేత
- జిల్లాలో ఐదునెలల వ్యవధిలో 89 రద్దు
- 664 మందిని అనర్హులుగా గుర్తింపు
- కార్డుల నుంచి వారి పేర్లు తొలగింపు
- కొనసాగుతున్న క్షేత్రస్థాయి విచారణ
- మరిన్ని కార్డులు రద్దయ్యే అవకాశం

కైలాస్‌నగర్: బోగస్ ఆహారభద్రత కార్డులను ప్రభుత్వం ఏరివేస్తోంది. రేషన్ డీలర్లకు లబ్ధిదారుల జాబితా పంపించి పరిశీలన ప్రక్రియ చేపడుతోంది. క్షేత్రస్థాయిలో అధికారులతో విచారణ చేయించి బోగస్ కార్డులు రద్దు, అనర్హుల పేర్లు కార్డుల నుంచి తొలగింపునకు చర్యలు చేపట్టింది. మృతి చెందిన, వివాహమై అత్తగారింటికి వెళ్లిన, స్థానికంగా నివాసముండని, ఆర్థికంగా ఉన్న వారి వివరాలు అందించాలని అధికారులను ఆదేశించింది. పలు మండలాల్లో ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలన పూర్తికావడంతో అనర్హుల కార్డులు రద్దు చేశారు. అనర్హులను కార్డుల్లోంచి తొలగించారు. కార్డుల్లోని అనర్హుల పేర్లు తొలగిస్తున్నారు. జిల్లాలో ఐదు నెలల వ్యవధిలో 89 కార్డులు రద్దు చేయగా, 664 మందిని అనర్హులుగా గుర్తించి కార్డుల్లోంచి వారి పేర్లు తొలగించారు. క్షేత్రస్థాయి పరిశీలన అన్ని మండలాల్లో చేపడితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

బియ్యం తీసుకోనివారివీ..!

జిల్లాలోని 18 మండలాల పరిధిలో 356 చౌకధరల దుకాణాలున్నాయి. వీటి ద్వారా ప్రతీనెల ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం అందజేస్తున్నారు. కొంతమంది లబ్ధిదారులు బియ్యం తీసుకోవడం లేదు. చాలామంది తీసుకున్న బియ్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం బోగస్ ఆహారభద్రత కార్డుల రద్దు, కార్డుల నుంచి అనర్హుల పేర్ల తొలగింపుపై దృష్టి సారించింది.

మండలాల వారీగా పరిశీలిస్తే..

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఐదు రేషన్‌కార్డులు రద్దు చేశారు. 50మందిని అనర్హులుగా గుర్తించి కార్డుల్లోంచి వారి పేర్లు తొలగించారు. నార్నూర్ మండలంలో 80 కార్డులు రద్దు చేశారు. 331 మంది పేర్లు తొలగించారు. గుడిహత్నూర్ మండలంలో ఒక కార్డు రద్దు కాగా, 12 మంది పేర్లను కార్డుల్లోంచి తీసివేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో మూడు రేషన్ కార్డులు రద్దు చేయగా, 19 మంది అనర్హుల పేర్లను కార్డుల్లోంచి తొలగించారు. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు మండలాల వారీగా ఆహార భద్రత కార్డులు, లబ్ధిదారుల సంఖ్య పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది.

నెలలవారీగా తొలగింపుల తర్వాత..

ఫిబ్రవరిలో తొలగింపుల అనంతరం జిల్లాలో 1,91,765 రేషన్‌కార్డులుండగా 6,38,883 మంది లబ్ధిదారులున్నారు. అలాగే మార్చిలో 1,91,761 రేషన్‌కార్డులుండగా 6,38,740 మంది లబ్ధిదారులు, ఏప్రిల్‌లో 1,91,678 రేషన్‌కార్డులుండగా 6,38,290 మంది లబ్ధిదారులు, మే లో 1,91,677 రేషన్‌కార్డులుండగా 6,38,233 మంది లబ్ధిదారులు, జూన్‌లో 1,91,676 రేషన్‌కార్డులుండగా 6,38,219 మంది లబ్ధిదారులున్నారు.

కార్డులు లేని అర్హుల పరిస్థితేమిటో?

ఆహారభద్రత కార్డుల్లో అనర్హులను గుర్తించి తొలగిస్తున్న ప్రభుత్వం అర్హులకు అన్యాయం చేస్తోంది. మూడేళ్లుగా రేషన్‌కార్డుల దరఖాస్తులకు సంబంధించిన వెబ్‌సైట్ మూసివేసింది. ఫలితంగా కార్డుల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండాపోయింది. దీనికి తోడు వివాహమై పుట్టింటి నుంచి అత్తవారింటికి వచ్చిన ఆడబిడ్డల పేర్లు, పుట్టిన పిల్లల పేర్లు రేషన్ కార్డుల్లో చేర్చేందుకు అవకాశం లేదు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించేందుకు రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుంటుండటంతో కార్డుల్లేని నిరుపేదలు ప్రభుత్వ పథకాలు పొందలేని పరిస్థితి నెలకొంది. కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినా ఇందుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. దీంతో ఎప్పటి నుంచి కార్డుల జారీ ఉంటుందనే విషయంలో స్పష్టత లేదు. కాగా, బోగస్ కార్డులు ఏరివేస్తూ.. అనర్హుల పేర్లు కార్డుల నుంచి తొలగిస్తున్న ప్రభుత్వం అర్హులకు కార్డులు జారీ చేయాలని, కార్డుల్లో అర్హుల పేర్లు నమోదు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోంది.

విపత్తు నిర్వహణపై అవగాహన పెంచాలి

జైనథ్: విపత్తు నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంచేలా కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. గురువారం ఆయన మండలంలోని కొరాట–చనాఖా బ్యారేజీని సీడబ్ల్యూసీ సభ్యులు, విపత్తు నిర్వహణ బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. వానాకాలంలో నదీతీర ప్రాంతాల్లోని ప్రజలు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో విపత్తు నిర్వహణ టీంను సిద్ధం చేశామని, అనుకోని ఘటనలు సంభవిస్తే ఈ బృందం సహాయక చర్యలు చేపడుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని



జైనథ్: బ్యారేజీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

సీఐ కార్యాలయాన్ని ఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు, దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం తదితరులున్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి

బేల: ప్రతీ ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఠాణాలోని రికార్డులు పరిశీలించారు. ఆవరణలో మొక్కలు నాటారు. ఫిర్యాదుల సంఖ్యపై ఎస్సై రాధికను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యలు సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ సాయినాథ్ ఉన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

నార్నూర్: రైతు భరోసాపై స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో రైతుల అభిప్రాయాలు సేకరించారు. డీఏవో పుల్లయ్య హాజరై మాట్లాడారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేశ్, మాజీ సర్పంచ్ గజానంద్‌నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పరమేశ్వర్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో పుల్లయ్య

క్లుప్తంగా

రెండు కిలోల గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు

బెల్లంపల్లి: పోలీసులు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతూనే ఉంది. కొందరు యువకులు గుట్టుగా కిలోల కొద్ది గంజాయిని రవాణా చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. తాజాగా గురువారం మహారాష్ట్ర నుంచి ఓ యువకుడు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడటం మరోమారు సంచలనమైంది. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టగా మందమర్రికి చెందిన రవి తేజ అనే యువకుడు బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించాడు. అతడి వద్ద బ్యాగు తనిఖీ చేయగా అందులో 2 కిలోల గంజాయి లభ్యమైంది. మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడు రవితేజను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీటి ప్రవాహంలో ఒకరు గల్లంతు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కెలికే గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటిలో కొట్టుకుపోయి గురువారం ఒకరు గల్లంతయ్యారు. జైనూర్ మండలంలోని సంబాజీగూడకు చెందిన జాదవ్ ప్రకాశ్ కెరమెరి మండలంలోని లేండిగూడ నుంచి జైనూర్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. భారీ వర్షం కురియడంతో మార్గమధ్యలో ఉన్న కెలికే కల్వర్టు దాటుతున్న క్రమంలో వరద తాకిడికి నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గుంపుల విజయ్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. రక్షణ చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

బావిలోపడి విద్యార్థి మృతి

లింగాపూర్: ప్రమాదవశాత్తు బావిలోపడి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన ఆత్రం రామకృష్ణ (15) ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం గ్రామ శివారులోని ఆత్రం విశ్వంబర్‌కు చెందిన వ్యవసాయ బావివద్దకు స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని తండ్రి ఆత్రం జగదీశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కొట్టె ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఉచిత శిక్షణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా పరిసర గ్రామాల్లోని నిరుద్యోగ యువకులకు వోల్వో, డంపర్, ట్రక్ ఆపరేటింగ్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసై హెవీగూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, మూడేళ్ల అనుభవం, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్నవారు ఈనెల 10లోగా ఎంవీటీసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మొక్కలు నాటాలి

లక్సెట్టిపేట: పాఠశాలలో మొక్కలు నాటాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోని బలరావుపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పాఠశాల ఆవరణలో చెత్త పిచ్చిమొక్కలు లేకుండా చూడాలన్నారు.

పాముల కాలం.. జర భద్రం

‘బాబోయ్ పాము’ అంటూ భయపడే రోజులొచ్చేశాయ్. వర్షాకాలంలో భూమి మొత్తం తడిసి పుట్టల్లో నీరు నిలవడంతో విషసర్పాలు బయట సంచరిస్తుంటాయి. పొలాల గట్లవెంట, పంటచేను సమీపంలోని ఇళ్లు, గుడిసెలు అన్నీ వీటికి ఆవాసాలే. మనిషి ప్రాణాలు తీసే సర్పాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇందుకు ముందస్తుగా కొన్ని రక్షణ చర్యలు తీసుకుంటే కొంతవరకు ముప్పు నుంచి బయట పడవచ్చు.

- పొంచి ఉన్న సర్పాల గండం
- పల్లెలు, పంట పొలాల్లో భద్రం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



తలమడుగు: ఉమ్మడి ఆదిలాబాద్ అడవుల జిల్లా కావడంతో విషసర్పాల బెడద అధికంగానే ఉంది. ఏటా పాము కాటుతో పలువురు మృత్యువాత పడుతున్నారు. గతేడాది జిల్లాలో 152 మంది పాము కాటు కు గురయ్యారు. ఎండాకాలంలో వ్యవసాయ పనులు ముగిశాక పంటచేలల్లోని గట్లవెంట, బోరియలు, పుట్టల్లో ఇవి ఆవాసం ఉంటాయి. నివాస గృహాలకు సమీపంలోని చెట్ల పొదల్లో, కట్టెల వెంబడి కూడా ఉంటాయి. అయితే వర్షాకాలంలో పొలాలు మొత్తం బురదమయంగా మారడం, వీటి ఆవాసాల్లోకి నీరు చేరడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వివిధ రకాల పాములు బయటికి వచ్చి పొడిభూమి వైపునకు వెళ్తాయి. ఈ క్రమంలోనే సమీపంలో ఇళ్లలోకి వస్తాయి. కోళ్లు, ఎలుకలు సంచరించే గృహాల వైపు ఆహార వేటకు వెళ్తాయి. ఇంటి ఆవరణలో పడేసి ఉన్న వంటచెరకు, తట్టలు, బుట్టలు, బస్తాల చాటు ను ముడుచుకుని అదునుకోసం వేచి చూస్తుంటా యి. ఇంటి చూరుల్లోకి చేరుతాయి. వాటి సమీపంలోకి మనుషులు వెళ్లి ఏదైనా పనులు చేస్తున్న క్రమంలో అవి కాటు వేస్తాయి. ఇక పంటచేలలో ప నులు చేసే రైతులు, కూలీలు కూడా పాము కాటుకు గురవుతుంటారు. పచ్చికలు, కలుపు మొక్కల మాటున, గట్ల మీద ఉండే పాముల సమీపంలోకి వెళ్లినప్పుడు వాటి మీద కాలు పడినప్పుడు కాటు వేస్తాయి. ఇలాంటి ప్రమాదాల్లో అనేక మంది చనిపోయిన సంఘటనలున్నాయి.

సర్పాల రకాలు, విష ప్రభావం ఇలా..

విషసర్పాలు రెండు రకాలు ఉంటాయి. ఒకరకం న్యూరోటాక్సిన్ నాగుపాము, రెండో రకం హిమోటాక్సిన్ రక్తపింజర. న్యూరోటాక్సిన్ రకం పాము కాటువేస్తే నోటినుంచి నురుగువచ్చి శ్వాస ఆడక ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. హిమోటాక్సిన్ రకం పాము కాటు వేస్తే శరీరంలోని రక్తనాళాల్లోని కణజాలం నశించి కాటువేసిన భాగంలో వాపు వచ్చి క్రమంగా మృతి చెందే అవకాశం ఎక్కువగా ఉంది. నాగుపాము కాటేస్తే పదిహేను సెకన్లలో విషం ఎక్కుతుంది. కట్లపాము కాటేస్తే క్షణంలో రక్తంలోకి ఎక్కుతుంది. రక్తపింజర కాటేస్తే రెండు గంటల తర్వాత విషం ఎక్కుతుంది. జెర్రిపోతు, నీరుకట్టె, వానపాములు కాటేస్తే విషప్రభావం ఉండదు.

అప్రమత్తంగా ఉండాలి

కప్పలు, ఎలుకలు సంచారం ఉన్న ప్రదేశంలో పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఇంటి ఆవరణ, పరిసరాల్లో నీటి నిల్వలు, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలి. ఇల్లు కడిగిన తర్వాత నీళ్లు బయటకు వెళ్లే రంధ్రాలు రాత్రి సమయంలో గుడ్డలు పెట్టి మూసి ఉంచాలి. బయటకు వెళ్తే చెప్పులు లేదా షూ వేసుకోవాలి. రాత్రి సమయంలో చేనువద్దకు వెళ్తే చేతికర్ర, టార్చిలైట్ కచ్చితంగా తీసుకెళ్లాలి. ఇంట్లో పడుకునేటప్పుడు కప్పుకునే దుప్పట్లు బాగా దులపాలి. నవారు, నులక మంచాలను చిన్న కర్రతో కొట్టి అందులో ఏమీలేవని నిర్ధారించుకున్న తర్వాతే వేసుకోవాలి.

కాటేశాక ఆందోళన చెందితే ఇంకా ప్రమాదం

పాముకాటుకు గురైన వారు ఆందోళన చెందకుండా నిర్భయంగా ఉండాలి. భయపడితే గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. పాము కాటువేసిన ప్రదేశంలో గట్టిగా కట్టుకట్టాలి. వెంటనే సమీపంలో ఉన్న వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలి. విషపూరితమైన పాము కాటువేస్తే శరీరం క్రమంగా నీలిరంగులోకి మారుతుంది. పాముకాటు వేసిన చోట నొప్పి, వాపు ఉంటాయి. కొందరికి పొక్కులు, దద్దుర్లు వస్తాయి. మరికొందరికి నోటి నుంచి నురగలు వస్తాయి. ఆయాసం వచ్చి శరీరమంతా చెమటలు పట్టి కోమాలోకి వెళ్తారు. అప్పుడు సాధారణం కంటే గుండె రెట్టింపు స్థాయిలో కొట్టుకుంటుంది. కచ్చితంగా ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి. నాటు వైద్యం పసర్లను నమ్మవద్దు.

భయాందోళనకు గురికావొద్దు

పాముకాటు గురైన వారు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దు. భయపడితే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. కాటు వేసిన వెంటనే కొందరు నాటువైద్యులను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. పాముకాటుకు గురైన వారు జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆరోగ్య కేంద్రంలో పాముకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయి.

– హరీశ్, వైద్యాధికారి, తలమడుగు పీహెచ్‌సీ

ఆశ్రమ పాఠశాల తనిఖీ

నార్నూర్: మండలంలోని జామ్‌డా బాలికల ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ రాజర్షిషా గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాతో కలిసి తనిఖీ చేశారు. తరగతి గదులు పరిశీలించి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించి హెచ్‌ఎం చౌహాన్ నెహ్రూకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీపీఆర్వో తిరుమల, పీడీ విశ్వనాథ్ తదితరులున్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



పాఠశాలలో హాజరు పరిశీలిస్తున్న డీఈవో

తలమడుగు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో ప్రణీత సూచించారు. గురువారం మండలంలోని పల్సి బీ గ్రామంలోగల జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. హాజరు శాతాన్ని పరిశీలించారు. సిలబస్ వివరాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులున్నారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే

మందమర్రిరూరల్: ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవడం ఎంతో ముఖ్యమని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. హైదరాబాద్‌లో కీర్తి అకాడమిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అటెంప్ట్ టూ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీల్లో కళాకీర్తి శిఖర అవార్డుతో పాటు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు, ప్రశంస పత్రాలు అందుకున్న చిన్నారులను అభినందించారు.

‘బొంతల ముచ్చట్లు’ ఆవిష్కరణ



పెద్దవాగు వద్ద పుస్తకం ఆవిష్కరిస్తున్న శ్రీధర్ దేశ్‌పాండే

బోథ్: మాజీ సీఎం కేసీఆర్ వద్ద నీటిపారుదల శాఖ ఓఎస్డీగా విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందిన ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు శ్రీధర్ దేశ్‌పాండే తన చిన్ననాటి అనుభవాలను పుస్తక రూపంలో పొందుపరిచారు. ఆయన స్వస్థలమైన బోథ్ గురించి, భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక అంశాలను అందులో పొందుపరిచారు. బోథ్‌ను గతంలో బొంతలగా పిలిచేవారు. దీంతో ఆయన రాసిన పుస్తకం పేరును ‘బొంతల ముచ్చట్లు’గా నామకరణం చేశారు. ఆడంబరాలకు వెళ్లకుండా ఈ పుస్తకాన్ని తాను చదివిన పాఠశాల, గ్రంథాలయం, ఈత కొట్టిన పెద్దవాగు, ఆడుకున్న పలు ప్రాంతాల్లో తన గురువులు, చిన్ననాటి స్నేహితుల మధ్య ఆవిష్కరించారు. బోథ్‌గా పిలిచే బొంతల ప్రాంతంలో కొండలు, గుట్టలు, సౌందర్యకరమైన పరిసరాలు, ఈ ప్రాంత వాసులు ఆచార వ్యవహారాలు, భాష, యాస, పద్ధతులను, ఈ ప్రాంత చరిత్రను భావితరాలకు తెలియజేయాలని పుస్తకం రాసినట్లు శ్రీధర్ దేశ్‌పాండే తెలిపారు. ఈ కార్యక్రమంలో అతని గురువులు అంబదాస్, నందయ్య, దేవన్న, 1978లో తనతో పాటు చదివిన మిత్రులు రమేశ్‌బాబు, నర్సయ్య, సదానందం, అరవింద్, అబుల్క అడెల్లు, మురళి, ముస్తఫా, సురేష్ వైద్య, భాస్కర్‌తో పాటు రావుల శంకర్ పాల్గొన్నారు.

వేరుశనగ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్

ఆదిలాబాద్‌టౌన్: గోదాముల్లో నిల్వ ఉంచిన వేరు శనగ బస్తాలను దొంగిలించిన ముగ్గురు దొంగలను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గతనెల 14న ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీనాథ్ జిన్నింగ్‌లో పది క్వింటాళ్ల వేరుశనగ సంచులు నిల్వ ఉంచగా వాటిని ఎత్తుకెళ్లారు. వాటితో పాటు సాగుకు సంబంధించిన రెండు బోరు మోటర్లను సైతం ఎత్తుకెళ్లారు. బాధితుడు పిరాని అన్వర్‌అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం నిందితులు ఖుర్షీద్‌నగర్‌కు చెందిన సయ్యద్ జావీద్, సుందరయ్యనగర్‌కు చెందిన తబ్రేజ్, సయ్యద్ ఇర్ఫాన్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. వారి నుంచి 3 క్వింటాళ్ల వేరుశనగ, బోరు మోటర్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను పట్టుకున్న క్రైం పార్టీ పోలీసులు రమేశ్, నరేష్, క్రాంతి, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్, నరేందర్‌ను సీఐ అభినందించారు.

పుస్తెలతాడు చోరీ

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు భూక్య యమున ఇంట్లోకి గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ఆమె మెడలో ఉన్న రెండుతులాల బంగారు పుస్తెలతాడు అపహరించారు. ఈ క్రమంలో వృద్ధురాలిని బలవంతంగా నెట్టివేయడంతో తలకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సీఐ నరేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఏఎస్సై పున్నం తెలిపారు.

వైద్యాధికారులు సమయపాలన పాటించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఉట్నూర్‌రూరల్: వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి ఐటీడీఏ పరిధిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ క్యాంపులు, ఏపిడవిట్ క్యాంపులు కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలకు సమయానికి మందులు అందేవిధంగా చూడాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ రిజిస్టర్లు పాటించాలని, రోడ్లు లేని గ్రామాలను గుర్తించి అవ్వల్ అంబులెన్స్ పోయే విధంగా మరమ్మతులు చేపడతామన్నారు. నీటికొరత లేకుండా చూడాలన్నారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారులు డాక్టర్ రాథోడ్ నరేందర్, అదనపు వైద్యాధికారి మనోహర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి టార్గెట్ బాల్ ఎంపిక పోటీల్లో సత్తా చాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని గౌరీ, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన వంశీ జూలై 9 నుంచి 12 వరకు నేపాల్‌లో జరగనున్న టార్గెట్ బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు ఇరు కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, అనిత గురువారం సైన్స్ డిగ్రీ కళాశాలలో క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరిలో సిద్దిపేటలో నిర్వహించిన జాతీయ స్థాయి టార్గెట్ పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. వారిలో తమ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉండడం గర్వకారణమన్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్

సారంగపూర్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన కొత్తపాటి రాజు (38) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య దేవికతో గొడవపడేవాడు. 15 రోజుల క్రితం అతని బాధ భరించలేక దేవిక సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ఉన్న పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం తెల్లవారు జామున మృతుని చిన్నాన్న చిన్నలింగన్న అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. దేవిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి బలవన్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కచికంటి గ్రామానికి చెందిన దాసరి ఆశన్న (38) గురువారం పురుగుల మందు తాగి బలవన్మరణం చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆశన్న భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది కచికంటి గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. అటుగా వెళ్లిన వారు గమనించి 108కు సమాచారం అందించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

బెజ్జూర్: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కృష్ణపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాయిని గంగయ్య (65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక గురువారం తెల్లవారు జామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నెన్నెల: మండలంలోని చిన్నవెంకటాపూర్ గ్రామానికి చెందిన చెల్కల విజయ (35) కిడ్నీలో నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. విజయ మూడేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. బుధవారం పత్తి విత్తనాలు వేయడానికి పంట చేనుకు వెళ్లగా అక్కడ మరోసారి తీవ్రమైన నొప్పి రావడంతో బాధ భరించలేక అక్కడే ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాలకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని మిమ్స్‌కు తీసుకెళ్లడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి!



రోడ్డుపై బైఠాయించిన కుటుంబ సభ్యులు

- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల రాస్తారోకో

కాగజ్‌నగర్‌రూరల్: వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దహెగాం మండలం కల్వాడకు చెందిన గర్భిణి ఇస్త్రావత్ సవితను కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షల కోసం చేర్పించారు. 9 నెలలు కూడా నిండకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఆపరేషన్ చేసినట్లు ఆమె భర్త రమేశ్ తెలిపారు. పుట్టిన పసికందును స్థానిక పిల్లల వైద్య నిపుణుడి వద్దకు తీసుకెళ్లగా ఆరోగ్యంగా ఉందని చెప్పడంతో ఆస్పత్రిలోనే ఉన్నామన్నారు. గురువారం ఉదయం పసికందు మృతి చెందిందని వైద్యులు చెప్పారని ఆయన పేర్కొన్నారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మృత్యువాత పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి సీఐ శంకరయ్య, ఎస్సై అంజయ్య చేరుకుని సముదాయించడంతో రాస్తారోకో విరమించారు.

క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలంగాణ సంస్కృతిక సారథి కళబృందం అధ్యక్షుడు కొడప నగేశ్ అన్నారు. గురువారం మండలంలోని ఏమాయికుంట గ్రామపంచాయతీ పరిధిలోని గలియబాయితండా గ్రామంలో కళజాత నిర్వహించారు. పాటలు పడుతూ, నృత్యం చూస్తూ.. సీజనల్ వ్యాధులపై, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళకారులు మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, కళాజాత బృందం కళాకారులు శంకర్, పురుషోత్తం, గోవింద్ రావ్ పాల్గొన్నారు.

వారసంత వేలం వాయిదా



పాల్గొన్న గ్రామపంచాయతీ అధికారులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే వారసంతకు గురవారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉట్నూర్ డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో భాస్కర్ సమక్షంలో వేలం నిర్వహించారు. నిర్ణీత కంటే తక్కువ ధర పలకడంతో వాయిదా వేసినట్లు డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు తెలిపారు. తిరిగి శనివారం యథావిధిగా వేలం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో సంజీవ్‌రావు, సిబ్బంది శంకర్‌లాల్ జైస్వాల్, ఇద్రిస్, నారాయణ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన కోటబోయిన లక్ష్మన్న ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందాడు. దీంతో గురువారం 1998- 1999 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు తన స్నేహితుడి కుటుంబసభ్యులకు రూ. 21 వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్నేహితుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బోథ్: నీట్ పరీక్ష లీకేజీ నిరసిస్తూ విద్యా సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన పాఠశాలలు కళాశాలల బంద్ విజయవంతమైంది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను విద్యార్థి సంఘాల నాయకులు మూసి వేయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మున్సిఫ్ మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమీర్, వెంకట రమణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైపులైన్ లీకేజీ



లీకవుతున్న భగీరథ నీరు

బోథ్: మండలంలోని నక్కలవాడ, మర్లపెల్లి గ్రామాల వంతెన వద్ద మిషన్ భగీరథ పైపులైన్ గురువారం లీకైంది. దీంతో తాగునీరు వృథా అవుతుంది. అలాగే సుర్దాపూర్ గ్రామంలో కూడా పైపులైన్ లీకైంది. పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వివేకానందుడి బోధనలు స్ఫూర్తిదాయకం

కైలాస్‌నగర్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన ప్రజ్ఞశాలి స్వామి వివేకానందుడి బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుని కొనియాడారు. మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తడ్సేన వెంకట్ రెడ్డి, వేముల నాగరాజు, దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

- మగిసిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం
- బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు



జైనథ్: సన్మానిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

తాంసి: ఎంపీపీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో మండలాలకు ప్రత్యేకాధికారులను కేటాయించారు. భీంపూర్ మండలానికి ప్రత్యేకాధికారిగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కిషన్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం ప్రత్యేకాధికారి కిషన్ బాధ్యతలను స్వీకరించారు. ఆయనను ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, ఏపీవో సంగీత, సిబ్బంది సన్మానించారు.

తాంసి ప్రత్యేకాధికారిగా వెంకట రమణ

తాంసి మండల ప్రత్యేకాధికారిగా ప్రభుత్వం సీపీవో వెంకటరమణ గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో మోహన్ రెడ్డి, సూపరింటెండెంట్ రవీందర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బేల ప్రత్యేకాధికారిగా శంకర్

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ చాంబర్‌లో మండల ప్రత్యేకాధికారిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఎంపీవో మహేశ్‌కుమార్‌లు శాలువా కప్పి, అభినందనలు తెలిపారు.

నేరడిగొండ ప్రత్యేకాధికారిగా రవీందర్..

నేరడిగొండ: మండల ప్రత్యేకాధికారిగా గనుల శాఖ ఏడీ రవీందర్‌ను నియమించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇదిలా ఉండగా ఎంపీడీవో రాజ్‌వీర్, సూపరింటెండెంట్ చక్రపాణి, ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జైనథ్ ప్రత్యేకాధికారిగా సాంబశివరావ్

జైనథ్: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా మత్స్యశాఖాధికారి సాంబ శివరావ్ నియమితులయ్యారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో రవీంద్రనాథ్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ముత్యం రావ్, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఇచ్చోడ ప్రత్యేకాధికారిగా పుల్లయ్య

ఇచ్చోడ: మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య గురువారం ఎంపీపీ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలస్థాయి అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

బోథ్ ప్రత్యేకాధికారిగా కిరణ్‌కుమార్

బోథ్: బోథ్ మండల ప్రజా పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా సివిల్ సప్లై అధికారి టి.కిరణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో ఎల్. రమేశ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. ఎంపీవో మహేందర్ రెడ్డి, ఏపీవో జగ్దే రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ ప్రత్యేకాధికారిగా మోహన్

బజార్‌హత్నూర్: మండల ప్రత్యేకాధికారిగా డీసీవో మోహన్ గురువారం మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అతుల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కాంచనమాల, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.



తాంసి: కిషన్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

మావల ప్రత్యేకాధికారిగా రాజలింగు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల ప్రత్యేకాధికారి జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగును నియమించారు. దీంతో గురువారం ఆయన మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో శంకర్, అధికారులు శాలువాతో సత్కరించారు.

ఇంద్రవెల్లి ప్రత్యేకాధికారిగా డీఆర్‌డీవో సాయన్న

ఇంద్రవెల్లి: ఎంపీపీ పదవికాలం ముగియడంతో గురువారం డీఆర్‌డీవో సాయన్న ఇంద్రవెల్లి ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల అధికారులు శాలువాతో సత్కరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఏపీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



ఇచ్చోడ: బాధ్యతలు స్వీకరిస్తున్న పుల్లయ్య



నేరడిగొండ: బాధ్యతలు స్వీకరిస్తున్న రవీందర్



ఆదిలాబాద్‌రూరల్: పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు



బోథ్: బాధ్యతలు స్వీకరిస్తున్న కిరణ్ కుమార్



బజార్‌హత్నూర్: బాధ్యతలు స్వీకరిస్తున్న మోహన్

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మ ధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ నార్త్, సౌత్, టౌన్–3, మావల, ఆదిలాబాద్‌రూరల్ విద్యుత్ వినియోగదారులు దీర్ఘకాలిక సమస్యలు ఉంటే సీజీఆర్ఎఫ్ కోర్టులో విన్నవించాలని సూచించారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

బోథ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివిన ఎనిమిది మంది విద్యార్థులు బాసరలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. సీహెచ్. నందిని, తేజస్విని, బి.సాయి, ఆర్.దుర్గాదాస్, ఎం.శ్రావణి, ఏ.మనోజ్, ఎండీ రయాన్,సీహెచ్. గణేష్ విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామానికి చెందిన రైతులు గురువారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాను కలిశారు. వర్షాధార పంటలను మాత్రమే పండిస్తున్నామని తమ భూముల్లో ఉచితంగా బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీంతో మూడు పంటల పండించి ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పీవో సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్, సిడం రాంపల్కు, కుమురం కిషన్, ఆత్రం నాగోరావు, భీంరావు, పొల్లు, మారన్న, తొడసం కృష్ణసాయి పాల్గొన్నారు.

రోశయ్య సేవలు మరువలేనివి

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య సేవలు మరువలేనివని ఆర్యవైశ్య మహాసభ నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కన్యక పరమేశ్వరి ఆలయంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రోశయ్య రాష్ట్ర మంత్రిగా, శాసన మండలి సభ్యులుగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా సేవలు అందించారని కొనియాడారు. 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనగం సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మధుకర్, రాజేష్, మోహన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సీజీఆర్ఎఫ్ వేదిక



మొక్కలు నాటుతున్న అధికారులు

ఇంద్రవెల్లి: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికే సీజీఆర్ఎఫ్ వేదికలు ఏర్పాటు చేయడం జరుగుతుందని సీజీఆర్ఎఫ్ చైర్మన్ రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) కార్యక్రమానికి హాజరయ్యారు. వినియోగదారులు, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి సబ్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా పలువురు విద్యుత్ వినియోగదారులు హాజరై విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ సుభాష్, హెచ్ఏవో డిగంబార్, జేఏవో అగర్వాల్, జేఈ రోహిదాస్, లైన్‌మెన్లు దుర్గారాజ్, నందలాల్, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఉన్నత పదవులు చేపట్టాలి



ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యులను సత్కరిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఐదు సంవత్సరాలుగా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగిన ప్రజాప్రతినిధులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పదవీకాలం పూర్తిచేసుకున్న మావల మండల ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రహీమ్ ఖాన్‌లను గురువారం మావలలోని ఆయన నివాసంలో సత్కరించారు. మావల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు తడ్సేన వెంకట్ రెడ్డి, వేముల నాగరాజు, దామోదర్ రెడ్డి, నలిమేలా నవీన్‌రెడ్డి, గణపతి రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌లో హద్దురాళ్ల తొలగింపు



జేసీబీతో రాళ్లను తొలగిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: మావల మండలం బట్టిసావర్గాం పరిధిలోని రాజీవ్ స్వగృహా అగ్రజా టౌన్‌షిప్ సమీపంలోని లేఅవుట్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్‌ను ఏర్పాటు చేసినట్లుగా గుర్తించిన ఆయన దానిపై చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అనురాధ ఆధ్వర్యంలో గురువారం బల్దియా సిబ్బంది లేఅవుట్‌ను సందర్శించారు. డీటీసీపీ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పాతిన హద్దురాళ్లను జేసీబీతో తొలగించారు. అక్రమ లేఅవుట్‌లను ఉపేక్షించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టీపీవో పేర్కొన్నారు. కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రణాళిక విభాగం సిబ్బంది వినయ్, ఊశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో రెండో విడత ప్రవేశం కోసం విద్యార్థులు ఈ నెల 15వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఐటీఐ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024- 25 విద్యా సంవత్సరంలో ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి, ఎనిమదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. 2024 ఆగస్టు 1 నాటికి 14 సంవత్సరాలు పూర్తయి ఉండాలన్నారు. వివరాలకు 94935 35378 సంప్రదించాలని కోరారు.

ఉట్నూర్‌రూరల్: గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 15లోపు దరఖాస్తులు చేసుకోవాలని 8వ, 10వ తరగతులు ఉత్తీర్ణులై విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



మాట్లాడుతున్న మారుతి డొంగ్రె

ఇంద్రవెల్లి: రైతుభరోసాపై రైతులు అందించిన సలహాలు, సూచనలు, అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలు సేకరించారు. పది ఎకరాల లోపు వ్యవసాయ భూమికి మాత్రమే రైతుభరోసా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుమ్ర కేశావ్‌రావ్, సభ్యులు మధుకర్, నిధ్యాన్‌సింగ్, పవార్ దుదిరాంనాయక్, చిక్రం భీంరావ్, సీఈవో ధరంసింగ్, సిబ్బంది తుమ్మల సునీల్, లక్ష్మణ్, సురేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఇంద్రవెల్లి: మండలంలోని భగత్‌సింగ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఆడే ప్రేమ్‌దాస్, పవార్ అంబాజీ ఉపాధ్యాయులను గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు చేసిన సేవలను కొనియాడారు. గ్రామస్తులు కంటతడి పెట్టి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో గ్రామస్తులు మనోజ్, మధుకర్, రవి, రాధాబాయి, పారుబాయి, పింకి పాల్గొన్నారు.

వనమహోత్సవానికి సిద్ధం చేయండి

ఇచ్చోడ: వనమహోత్సవానికి సిద్ధం చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం ఇచ్చోడ తండా వద్ద మొక్కలు నాటడం కోసం తవ్వుతున్న గుంతలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని కోరారు.

ఆధార్‌లో మార్పులు ఉంటే సరిచేసుకోండి

నేరడిగొండ: ఆధార్‌కార్డులో మార్పుచేర్పులు ఉంటే సరిచేసుకోవాలని ఎంపీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం మండలంలోని చించోలి గ్రామంలో ఆధార్ కార్డు అప్‌డేట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆదివాసీలు ఉన్న గ్రామమైన చించోలిలో మీసేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆర్ఐ నాగోరావు, ఐకేపీ ఏపీఎం ఉత్తమ్, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్, ఐకేపీ సీసీ సరిత పాల్గొన్నారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

నేరడిగొండ: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ ఒక ప్రకటనలో కోరారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలు సాధించాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఎదులాపురం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కొమురయ్య 78వ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ నాయకులు కుంటాల రాములు, అరుణ్‌కుమార్, కృష్ణస్వామి, బెజ్జంగి నర్సింగ్‌రావు, కాంబ్లే రాందాస్, ఖండాల గణేశ్ పాల్గొన్నారు.

మోదీ ఫాసిస్టు శక్తులను ఓడించాలి

తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో మోదీ ఫాసిస్టు శక్తులను ఓడించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకట నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కొమురయ్య 78వ స్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రజి హరీశ్, మడావి గణేష్, దీపలక్ష్మి, దత్తు, పూజ, అజయ్, అర్జున్, శ్రీకర్ పాల్గొన్నారు.

పెట్టుబడిదారి, భూస్వామ్య విధానాన్ని నిర్మూలించాలి

దేశంలో పెట్టుబడిదారి, భూస్వామ్య విధానం నేటికి కొనసాగుతుందని, దీనిని నిర్మూలించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఉమ్రే నితిన్, ఆత్రం వినోద్ కుమార్, అజ్మీర వినోద్ కుమార్, సిడాం సాయికుమార్, కుమ్ర అశోక్, కోడప సురేశ్ పాల్గొన్నారు.

చిత్రం గీసి.. అభిమానం చాటి



రాజు గీసిన జోగు రామన్న చిత్రం

తాంసి: ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జోగు రామన్నపై అభిమానంతో మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన చిత్రకారుడు గట్టు రాజు జోగు రామన్నపై అభిమానంతో పెన్సిల్‌తో ఆయన చిత్రాన్ని గీసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి తనకున్న అభిమానాన్ని చాటాడు.

జోగు రామన్నకు సన్మానం

ఇచ్చోడ: మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నను గురువారం ఇచ్చోడ బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. జోగు రామన్న జన్మదిన సందర్భంగా ఇచ్చోడ బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, నాయకుడు గాడ్గే సుభాష్, పాండురంగ్, మహేందర్‌రెడ్డి, నర్వ డే రమేశ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి



వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో అపర్ణ

నేరడిగొండ: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని ఏఈవో అపర్ణ అన్నారు. గురువారం మండలంలోని కుమారి గ్రామంలో రైతుల పంట పొలాలకు వెళ్లి సాగు చేస్తున్న పంటల వివరాలు నమోదు చేశారు. రైతులు ఏ పంట వేశారో వాటి పేర్లను నమోదు చేసుకున్నారు. పంటల వివరాలను నమోదు చేయిస్తే వాటిని విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని సూచించారు. ఆమె వెంట పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, ఓర్సరాజు యాదవ్, అగ్గు రమేశ్, గజ్జన్న, లక్ష్మణ్, హరీష్‌కుమార్ పాల్గొన్నారు.